సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పద్మనాభం హైస్కూల్లో ఆధార్ కేంద్రం ప్రారంభం



హైస్కూల్లో ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం వరకు ఇక్కడ ఈ కేంద్రం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆధార్‌లో పేర్లు, పుట్టిన తేదీల్లో మార్పులుంటే చేసుకోవచ్చని తెలిపారు. 5 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులు వీటిని మార్చుకోవడానికి క్యూఆర్ కోడ్‌తో ఉన్న జనన ధ్రువీకరణ పత్రం, 18 ఏళ్లు దాటిన విద్యార్థులు వీటిని మార్చుకోవడానికి పదో తరగతి ఉత్తీర్ణత పొందిన ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని రావాలని తెలియజేశారు. ఈ కేంద్రాన్ని మండల పరిషత్ ఏవో జయ ఉమ సందర్శించారు.

జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆకస్మిక తనిఖీ



ఆనందపురం మండల కార్యాలయం వద్ద డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

మధురవాడ: ఆనందపురం మండల కార్యాలయాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో మాట్లాడి మండలంలో సర్వేలు, శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఉపాధి హామీ(ఎన్ఆర్ఈజీఎస్) పనులు, మండల సమావేశ మందిరాన్ని పరిశీలించారు. మండల అభివృద్ధి కార్యాలయం నిర్వహణ తదితర అంశాలపై ఎంపీడీవో డాక్టర్ డి.జానకి, ఇతర అధికారులకు పలు సూచనలు చేశారు.

గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి

భీమునిపట్నం: భీమిలి మండలంలో బీజేపీ బూత్ స్థాయి కమిటీల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు సూచించారు. తాళ్లవలస గ్రామం వద్ద నాయకుడు ఏకూరి వెంకట చైతన్య వర్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొట్టు అప్పలనారాయణ, జగదీశ్వరరావు, రామ్‌కుమార్, శ్రీనివాసరావు, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

మధురవాడ: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆనందపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయిని జయలక్ష్మి వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీవీఎస్ అప్పారావు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమునిపట్నం: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని యూసీడీ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మి కోరారు. చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు పథకాలకు సంబంధించి, సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇందులో ఎనిమిది రకాల పథకాలు ఉన్నాయని, వీటిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని సూచించారు. పథకాల గురించి వివరించారు.రుణాలు మంజూరైన వారికి వాటిని అందించారు. డీపీవో కనకమహాలక్ష్మి, జెడ్పీ ప్రేమ ప్రసన్న వాణి పాల్గొన్నారు.

సోమవారం నాటి కూరగాయల ధరలు
(ఆనందపురం, తగరపువలస మార్కెట్‌లలో)

కూరగాయలు	ధర (రూ.)		
వంకాయలు	60	దొండ	40
టమాటా	50	ఆనప	30
క్యారెట్	50	మునక్కాడ	10
బంగాళాదుంప	40	క్యాలీఫ్లవర్	50
ఉల్లిపాయలు	60	క్యాబేజీ	40
బీర	50	వెల్లుల్లి	400
బీట్‌రూట్	50	చిక్కుడు కాయలు	60
క్యాప్సికం	100	బీన్స్	120
అల్లం	120	గోరుచిక్కుడు	60
బెండ	50	పచ్చి మిర్చి	70
		కొత్తిమీర కట్ట	20



ధరల మంట

చుక్కలలో కూరగాయలు , నూనెల రేట్లు ▪ పేద, మధ్యతరగతి వర్గాల బెంబేలు



ఆనందపురం కూరగాయల మార్కెట్‌లో దుకాణాలు

తగరపువలస: కూరగాయల ధరలు వినియోగదారులను హడలెత్తిస్తున్నాయి. మార్కెట్‌కు రూ.500 పట్టుకువెళ్లినా సంచి నిండే పరిస్థితి కనిపించడం లేదు. ఈ రోజు ఉన్న ధర రేపటికి పెరిగిపోతుండటంతో ఎలా కొనేది? ఏం తినేది? అంటూ తలలు పట్టుకుంటున్నారు. కాయగూరలే కాకుండా ఆకు కూరలు, అల్లం, వెల్లుల్లి ధరలు కూడా అందనంటున్నాయి. కొన్ని కూరగాయల ధరలు వింటేనే వణుకు పుట్టే పరిస్థితి నెలకొని ఉంది. గతంలో అందుబాటులో ఉండే వంకాయ, ఉల్లి, టమాటా, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, ఆనపకాయలు, బీర, బెండ వంటివి కూడా పేరు చెబితేనే దడ పుట్టిస్తున్నాయి. కార్తీకమాసం కావడంతో అందరూ శాకాహారం తీసుకోవడం, దీక్షాపీఠాల వద్ద అన్న సమారాధనల కారణంగా కూరగాయలు మండిపోతున్నాయి. గత సెప్టెంబరు, ఆక్టోబరు మాసాలలో కురిసిన వర్షాలు కూడా వీటి డిమాండ్‌కు కారణమయ్యాయి.

రైతుబజారుల్లోనే ధరలు ఇలా మంటలు పుట్టిస్తుంటే తగరపువలస, ఆనందపురం వంటి చిరువ్యాపారులు ఉండే ప్రాంతాలతో పాటు రహదారుల వెంట కొత్తగా వెలసిన దుకాణాలలో కిలోకు అదనంగా రూ.20 చెల్లించుకోవలసి వస్తోంది. కార్తీక, మార్గశిర మాసాలలో కూరగాయల ధరలు పెరగడం సాధారణమే అయినా ప్రస్తుతం ఈ ధరలు మరింతగా బాధిస్తున్నాయి. పోనీ పెరిగిన ధరలను తట్టుకుని కొనుగోలు చేద్దామన్నా నాణ్యమైన కూరగాయలు లభించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. బెండ, దొండ, చిక్కుడు, బీర, క్యాప్సికమ్ వంటివి బాగా ఉండటం లేదని చెబుతున్నారు.

రైతు బజారు ప్రారంభంలో జాప్యమెందుకు?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిట్టివలసలో రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మించినా ఎన్నికల కోడ్ సమీపించడంతో చివరి ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం నెలరోజుల క్రితమే ప్రారంభించడానికి సన్నాహాలు చేసినా ఎందుకనో వెనుకంజ వేస్తుంది. దీంతో తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌లో అందుబాటులో లేని కూరగాయల ధరల కారణంగా వినియోగదారులు విశాఖ, విజయనగరంలలో రైతుబజార్లను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల పప్పుల ధరలు కూడా ఆందోళనకు గురిచేసినా కాస్త శాంతించాయి. బియ్యం, నూనెల ధరలు మాత్రం మరింతగా మండిపోతున్నాయి. రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా వ్యాపారులు ముందు జాగ్రత్తగా బియ్యం, నూనె డబ్బాల నిల్వలు చేసుకుని రోజురోజుకు పెంచుకుంటూ పోతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలపై భారం



మార్కెట్‌కు వెళ్లి ఏం కొందామన్నా ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పచ్చిమిర్చి కూడా రూ.70 అయిపోయింది. నూనెల ధరలైతే సలసల కాగుతున్నట్లే ఉన్నాయి. మరోవైపు కరెంట్ చార్జీలు షాక్ కొడుతున్నాయి. ధరలన్నీ ఇలా మండిపోతే పేద, మధ్యతరగతి ప్రజలు బతికేదెలా?

– కొండుపు పాపయ్యమ్మ, సంతపేట

మాంసం కంటే ఎక్కువ ధరలు



కూరగాయలు కొనుగోలు చేసే కంటే చేపలు, చికెన్ కొనడం బెటర్ అనిపిస్తుంది. ఏ ఒక్క కూరగాయ కూడా కొనలేకపోతున్నాం. రూ.500 మార్కెట్‌కు పట్టుకుని వెళితే ఏమీ కనిపించడం లేదు. ముఖ్యంగా ఉల్లిపాయలు, టమాటా ధరలు నిలకడగా ఉండటం లేదు. అల్లం, వెల్లుల్లి ధరలు సరేసరి. ప్రభుత్వం ధరల నియంత్రణపై పట్టు కోల్పోయింది. –నీలాపు శివశంకరరెడ్డి, వలందపేట

బ్లాక్ మార్కెట్‌పై దృష్టి పెట్టాలి



సంక్రాంతి పప్పుల చీటీలను దృష్టిలో పెట్టుకుని కొందరు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలను అమాంతం పెంచుతున్నారు. ఇలాంటి వారిపై దాడులు చేసి వస్తువుల ధరల సరఫరాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలి.

– బోయి చిన్నారెడ్డి, చిట్టివలస

శిక్షణ సామగ్రి తయారీపై వర్క్‌షాప్



ప్రసంగిస్తున్న ఈడీ రాణి మందా

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ భవన్‌లో జన జాతీయ గౌరవ దివస్ (జేజేజీడీ) గిరిజన గౌరవ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మెథడాలజీ పుస్తకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మంద ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆదివాసి ఒరియా, సవారా, కువి, కొండా, కోయ, బంజార, సుగాలి అనే గిరిజన భాషలపై మాతృభాష ఆధారిత బహుభాషా విద్య (ఎంటీవీ-ఎంఎల్ఈ) మెథడాలజీ పుస్తకాలపై శిక్షణ సామగ్రి తయారీ కోసం ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, పల్నాడుకు చెందిన గిరిజన లాంగ్వేజ్ రిసోర్స్ పర్సన్స్, టీచర్లు (40 మంది సభ్యులు) పాల్గొని ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన భాషా నిపుణులు దూపకుట్ల రమేష్ భూషణ్, కోర్సు కో–ఆర్డినేటర్ డా. చిక్కాల నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతుల సందర్శన



విద్యార్థులతో ఎంఈవో శివరాణి

తగరపువలస: చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులను ఎంఈవో శివరాణి సోమవారం సందర్శించారు. విద్యార్థులు నేర్చుకుంటున్న విధానం తెలుసుకుని, పలు సూచనలు చేశారు. మూడు రోజులుగా విద్యార్థులకు బోధిస్తున్న గుంటూరుకు చెందిన కీ రిసోర్సు పర్సన్ రాజారావును సన్మానించారు. ఎన్ఎంఎంఎస్‌లో అనుభవమున్న సీనియర్ ఉపాధ్యాయులు వైపీ రమణ, పక్కి నాగేశ్వరరావు, శ్రీను, శివ కుమార్, దత్తి శ్రీను, ఎం.జగన్, ఆనంద్, సీహెచ్ దయాసాగర్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖా అప్పారావు, గౌరవ అధ్యక్షుడు పి.మురళీ మోహనరావు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు ముగిసిన ప్రయోగ పరీక్షలు



ఛాత్రోపాధ్యాయులతో డైట్ సీనియర్ లెక్చరర్ సోమయాజులు

తగరపువలస: మూడు రోజులుగా జరుగుతున్న ఛాత్రోపాధ్యాయుల ద్వితీయ సంవత్సర ప్రయోగ పరీక్షలు సోమవారంతో ముగిశాయని డైట్ సీనియర్ లెక్చరర్ సీఏ సోమయాజులు తెలిపారు. బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ఛాత్రోపాధ్యాయులకు జరిగిన అంత్య ప్రయోగ పరీక్షలను సోమవారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్లు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయని ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల హెచ్ఎం ఆర్.అప్పలరాజు ఛాత్రోపాధ్యాయులతో బోధనాభ్యసన సామగ్రి తయారుచేయించి, ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు, బొమ్మలు అందిస్తున్న యువకులు

భీమునిపట్నం: స్థానిక మత్స్యకారులు ఉంటున్న బోయివీధి ప్రాంతంలో ఉంటున్న పేద విద్యార్థులకు ఆ ప్రాంత యువకులు సోమవారం నోట్ పుస్తకాలు, ఆట వస్తువులను అందించారు. వారు మాట్లాడుతూ పేద పిల్లలకు తమ వంతు సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాసరపు ఎల్లాజీ, అరసవల్లి అనిల్ కుమార్, కాసరపు శివ, వీర్రాజు పాల్గొన్నారు.

మూడు నెలలుగా జీతాల్లేవు

- కుటుంబాలు గడిచేదెలా?
- మున్సిపల్ కార్మికుల ఆవేదన
- జోనల్ కార్యాలయం వద్ద ధర్నా



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మధురవాడ: మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగ కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే కుటుంబాలు గడిచేదెలా అంటూ ప్రశ్నించారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యానర్లు, ప్లకార్డులతో సోమవారం మధ్యాహ్నం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతుంటే మరోవైపు చాలీచాలని జీతాలు అదీ సకాలంలో చెల్లించకపోతే కుటుంబాలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. దూర ప్రాంతాల నుంచి విధులకు వచ్చేవారు కనీసం చార్జీలకు కూడా డబ్బుల్లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జెడ్సీ సింహాచలానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎంవీ ప్రసాద్, సిటూ ఆరిలోవ నాయకుడు నరేంద్ర కుమార్, నాయకులు ఎస్. గౌరి, జె.దేవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి
- సీపీఐ నాయకుల డిమాండ్



బొట్లవానిపాలెంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మధురవాడ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ పేదలకు 2సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3సెంట్లు స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శివశక్తినగర్ నుంచి బొట్టవానిపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన 71వ వార్డు సచివాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే అన్ని రకాలుగా మెరుగ్గా ఇస్తామన్న హామీని నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అలాగే గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన లే అవుట్లు మార్పుచేసి రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, జిల్లా సమితి నాయకులు ఎండీ బేగం, పార్టీ సీనియర్ నాయకులు వి.కేశవయ్య, ఎస్‌కే సల్మా, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు.

ఫిర్యాదు చేసినా కానరాని స్పందన

- అర్జీదారుల ఆవేదన
- మధురవాడ పీజీఆర్ఎస్‌కు 18 వినతులు



జెడ్సీకి వినతిపత్రం అందిస్తున్న సత్యనారాయణ

మధురవాడ: తాము ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు ఇచ్చినా ప్రయోజనం లేకపోతోందని బింద్రానగర్ వాసులు సాగర్ తదితరులు వాపోయారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ సింహాచలం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలువురు దరఖాస్తుదారులు వినతిపత్రాలు అందించారు. షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్ వాసులు మాట్లాడుతూ పార్కులో అక్రమ నిర్మాణాలు తొలగించకుండా అధికారులు అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

- రేవళ్లపాలెంలో అక్రమంగా కడుతున్న ఇంటి నిర్మాణాన్ని ఆపాలని రవికిరణ్ కోరారు.
- అనధికార వెహికల్ పార్కింగ్, చెత్త షాపు, రోడ్లపై ఉంచుతున్న సిలిండర్ల వలన ఇబ్బందులపై మొల్లి లక్ష్మణ ఫిర్యాదు ఇచ్చారు.
- జీవీఎంసీ 5వ వార్డులో ఇంటి కుళాయిల ఏర్పాటు కోసం నివాసాలకు ఇంటి పన్నులు వేయాలని కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు.
- పశువుల మాంసం వ్యర్థాలు డంపింగ్ యార్డులో కలుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేవీఆర్ సత్యనారాయణ ఫిర్యాదు ఇచ్చారు.

.. ఇలా జోన్ పరిధిలోని 9 వార్డుల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 18 అర్జీలు వచ్చాయి. వాటిలో టౌన్‌ప్లానింగ్ విభాగం ఫిర్యాదులే ఎక్కువ ఉన్నాయి. సదరు ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

● అభిషేక ప్రియునికి నీరాజనం



కొమ్మాది: రామాద్రిలో శివయ్యకు పూజలు

అభిషేక ప్రియుడికి నీరాజనాలు సమర్పించారు భక్తులు. కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే ఆలయాల్లో సందడి మొదలైంది. ధ్వజస్తంభాల వద్ద, నందీశ్వరుడి సన్నిధిలో మహిళలు దీపాలను వెలిగించారు. అంతటా పంచాక్షరి ప్రతిధ్వనించింది. – సాక్షి నెట్‌వర్క్



భీమునిపట్నం: చోడేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం



పీఎం పాలెం: కారుషెడ్ శివాలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



మధురవాడ: వుడా కాలనీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఈవో, కమిటీ సభ్యులు



మధురవాడ: సిద్ధేశ్వర స్వామి ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న శివ మాలధారులు

శిర్లపాలెంలో ఆక్రమణల తొలగింపు



శిర్లపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

మధురవాడ: ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామంలో అక్రమంగా నిర్మించిన షెడ్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఇక్కడ సర్వే నంబరు 27 చెరువు గర్భంలో ఓ వ్యక్తి తాటి ఆకుల షెడ్ నిర్మాణం, ఇతర సామగ్రి ఉంచి ప్రభుత్వ భూమి ఆక్రమణ చేస్తున్నారు. దీంతో ఆర్ఐ ఉమాఇదేవి ఆధ్వర్యంలో వీఆర్వో లింగాల అప్పారావు తదితరులు ఆక్రమణ తొలగించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒకరిపై సోమవారం కేసు నమోదు చేసి, 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్యవరపు అశోక్ తన ఇంట్లో మద్యం అమ్ముతున్నట్టు తమకు సమాచారం రాగా, దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు.

ఘనంగా పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్ట



డాక్‌యార్డు కాలనీలో కొలువైన అమ్మవారు

మధురవాడ: మధురవాడ డాక్‌యార్డు కాలనీలో నిర్మించిన పైడితల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించారు. ఉదయం నుంచే యంత్రపూజలు, అధివాస హోమం, నవదుర్గా హోమాలు నిర్వహించారు. శతాధిక ప్రతిష్ఠాచార్యులు అధికార్ల కాళిదాసు బృందం ఆధ్వర్యంలో ఉదయం 11.11 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాపనా మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు, గ్రామ పెద్దలు బంగారు అశోక్ కుమార్, నక్కా శ్రీధర్, చిన్నం నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాయని సునీత సందడి



విద్యార్థులతో మాట్లాడుతున్న గాయని సునీత

కొమ్మాది: సినీ నేపథ్యగాయిని సునీత తన స్వరాలతో సందడి చేశారు. గీతం హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగం గీతం కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె యువతతో మాట్లాడారు. చదువుతో పాటు సంగీతం, నృత్యం, చిత్రకళల్లో ఏదో ఒకదానిలో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మనిషి మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి సంగీతం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ చిత్రాల్లో తాను నేపథ్యగానం అందించిన పాటలను పాడి, అలరించారు.

ఆక్రమణలతో మత్స్యకారులకు తీవ్ర నష్టం



దీక్షల్లో పాల్గొన్న మత్స్యకార మహిళలు



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమునిపట్నం: భీమిలి తీర ప్రాంతంలో మత్స్యకారులకు నష్టం వాటిల్లే విధంగా జరుగుతున్న ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు కోరారు. లేకుంటే మత్స్యకారులంతా తీవ్రంగా నష్టపోతామన్నారు. ఆక్రమణలకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే దీక్షల్లో సోమవారం మత్స్యకార మహిళలు పాల్గొన్నారు. ఆర్డీవో సంగీత్ మాథుర్‌కు వినతి పత్రంఅందించారు. పి.సి.అప్పారావు,కొండబాబు, ఎల్లారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.